నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | జనవరి 05, 2025 | www.navatelangana.com



## తొలి వేతనంతో విద్యార్థులకు ఐడీ కార్డులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

2024 డీఎస్సీ ద్వారా పోచారం గ్రామంలో గల ఎంపీ యుపిఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా నియమితులైన ఉదయ్ కిరణ్ తన మొదటి జీతంతో పాఠశాల విద్యార్థులకు ఐడి కార్డులు చేయించి అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడి కృషిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారి భాస్కర్ రెడ్డి , కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ఐడీ కార్డులు అందజేత

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఎంపికలో రోస్టర్ విధానం

- గురుకులాల ప్రాంతీయ సమన్వయ కర్త గంగారాం నాయక్

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ పాఠశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఎంపిక కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను స్వల్ప మార్పులు చేస్తూ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు పరచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు ఆ సంస్థ ప్రాంతీయ సమన్వయకర్త గంగారాం నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోస్టర్ పాయింట్ల ఆధారంగా అభ్యర్థుల ఎంపికను చేపడతామని తెలిపారు. పూర్తి మెరిట్ ఆధారంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఆమోదంతో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. రోస్టర్ ఎంపిక విధానం వివరాలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో పొందు పరిచినట్లు తెలిపారు.


సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)

# నేనే వెళ్తా.. నువ్వే కూర్చో

- కలెక్టరేట్‌లో ఆఫీస్, కుర్చీ కోసం ఓ యూనియన్ నాయకుడి పేచి
- సదరు నాయకుడి తీరుపై ఉన్నతాధికారుల సీరియస్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం.. ప్రజల సౌకర్యార్థం అన్ని శాఖల కార్యాలయాలను ఒకే వద్దకు తీసుకువచ్చి నిర్మించిన భవన సముదాయం. కాగా అందులో సరిపడా కార్యాలయాలు లేక.. పలు శాఖలు ఈ సముదాయం వెలుపలే కొనసాగుతున్నాయి. అయితే ఓ యూనియన్ నాయకుడు.. తన యూనియన్ కోసం ఓ ఆఫీస్, కుర్చీ కేటాయించాలని పట్టుబడుతున్నట్టు సమాచారం. ఇప్పటికే అన్ని గదులను శాఖలకు కేటాయించగా.. కొన్ని శాఖలకు రూమ్‌లు లేకపోవడంతో ఒకే రూమ్‌ను పార్టిషన్ చేసి రెండు శాఖలకు కేటాయించిన పరిస్థితి ఉంది. ఇలాంటి సమయంలో సదరు యూనియన్ నాయకుడు.. ఆఫీస్ కోసం, కుర్చీ కోసం పేచీ పెడుతున్నట్టు వినికిడి. సదరు నాయకుడి తీరుతో ఉన్నతాధికారులు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. ఈ సమయంలో ఓ అధికారి తానే వెళ్తానని, తన కుర్చీ తీసుకోవాలని అసహనం వ్యక్తం చేసినట్టు భోగట్ట.

నిజామాబాద్‌లోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో సరిపడా గదులు లేక పరిశ్రమల శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఎడ్యుకేషన్‌లో ఇంజినీరింగ్ సెక్షన్‌కు ఇప్పటికీ ఇతర చోట్ల కొనసాగుతున్నాయి. దీంతో పాటు కలెక్టరేట్‌లో ఒక్కో రూమ్‌లో పార్టిషన్ చేసుకొని రెండు డిపార్ట్‌మెంట్‌లు సైతం కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఫుడ్ సేఫ్టీ, భూగర్భ జలశాఖ విభాగాలు ఒకే గదిలో కొనసాగుతున్నాయి. అదే విధంగా డ్రగ్, రెడ్‌కో శాఖలకు సైతం ఒకే రూమ్ కేటాయించారు. అక్కడ పరిస్థితి అలా ఉంటే.. ఓ యూనియన్ నాయకుడు తన కోసం ప్రత్యేకంగా రూమ్, కుర్చీ కేటాయించాలని అడుగుతుండటం పట్ల ఉన్నతాధికారులు ఆయన తీరుపై మండిపడుతున్నట్టు సమాచారం. యూనియన్‌లకు రూమ్‌లు కేటాయించుకుంటూ పోతే.. కార్యాలయాలు ఎక్కడ నిర్వహించాలని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సదరు నాయకుడి తీరు పట్ల అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# 18 వేల ఎకరాల్లో చెరుకు సాగుచేస్తే నిజాంషుగర్స్ పునరుద్ధరణ

- పున: ప్రారంభించేందుకు ప్రభుత్వం సుముఖమే
- రైతులు చెరుకు సాగుకు ముందుకు వస్తేనే సాధ్యం
- సదస్సులో ఎమ్మెల్యేలు, కేన్ కమిషనర్ వెల్లడి
- ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని బిల్లుల చెల్లింపులపై హామీ ఇవ్వాలని రైతుల సూచన


బోధన్ ప్రాంత రైతులతో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్

'చెరకు రైతుల చిరకాల వాంఛ అయిన నిజాం చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించే విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉంది. రైతులు చెరకు సాగుకు ముందుకు వస్తే ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తాం. రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీని పునరుద్ధరింపజేసేందుకు అంకితభావంతో కృషి చేస్తున్నాం. ఈ ప్రాంత రైతుల ప్రయోజనాల కోసం నిజాం షుగర్స్‌ను తెరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముఖ్యమంత్రికి సూచించగా, సీఎం సానుకూల వైఖరితో అవసరమైన చర్యలు తీసుకుంటు న్నారని తెలిపారు. ఇందులో భాగంగానే ఫ్యాక్టరీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న సుమారు 190 కోట్ల రూపాయల బకాయిలను ప్రభుత్వం చెల్లించింది. కనీసం 16 వేల నుండి 18 వేల ఎకరాల విస్తీర్ణంలో చెరకు పంటను సాగు చేస్తే ఫ్యాక్టరీలో క్రషింగ్ జరపవచ్చు. చెరకు సాగుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం తరఫున సబ్సిడీపై విత్తనాలను సమకూర్చడంతో పాటు అన్ని విధాలుగా తోడ్పడును అందిస్తామని' ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, షుగర్ కేన్ కమిషనర్ మల్సూర్ వెల్లడించారు. నిజాం షుగర్స్ ను పున్ణ ప్రారంభించే చర్యల్లో భాగంగా శనివారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి శివారులోని సరయు ఫంక్షన్ హాల్‌లో స్థానిక శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి నేతృత్వంలో ఫ్యాక్టరీ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన చెరకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యేలతో పాటు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర రావు తదితరులు సదస్సులో పాల్గొన్నారు.





చెరకు సాగుకు స్థానికంగా గల అనువైన పరిస్థితులు, చెరకు పంటతో సమకూరే లాభాలు, అందుబాటులోకి వచ్చిన ఆధునిక యంత్ర పరికరాలు, అధిక దిగుబడి ని అందించే వంగడాలు, చెరకు సాగులో పాటించాల్సిన యాజ మాన్య పద్ధతులు తదితర విషయాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు బాలాజీ నాయక్, విజయ్ కుమార్ తదితరులు రైతులకు అవగాహన కల్పించారు.

దశాబ్ద కాలం క్రితం వరకు కూడా కొనసాగిన నిజాం షుగర్స్ వివిధ కారణాల వల్ల 2015 నుండి మూతపడగా, ఈ కర్మాగారాన్ని తిరిగి తెరిపించి క్రషింగ్ చేపట్టాలంటే ప్రతిరోజూ కనీసం 3500 మెట్రిక్ టన్నుల చెరకు నిల్వలు అవసరం అవుతాయని, ఏడాదిలో 130 రోజుల వరకు గానుగ ఆడించాల్సి ఉంటుందని అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ చెరకు పంట సాగుకు రైతులు సంసిద్ధత తెలిపితే, కర్మాగారాన్ని తెరిపించి నిజాం షుగర్స్‌కు పూర్వ వైభవం చేకూరుస్తామని, ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదని స్పష్టం చేశారు. చెరకు ఫ్యాక్టరీకి అనుబంధంగా ఉన్న డిస్టిల్లరీ యూనిట్‌ను కూడా తెరిపించాలని ధృడ సంకల్పంతో ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఇప్పటికే ఫ్యాక్టరీ పునరుద్ధరణ చేసేందుకు ఎన్ని నిధులు వెచ్చించాల్సి వస్తుందనే దానిపై అధికారులు ప్రాథమికంగా అంచనాలు రూపొందించారని తెలిపారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, చెరకు పంట సాగు పై రైతుల అభిప్రాయాలను తెలుసుకుని, ప్రభుత్వం నుండి వారు ఏమి ఆశిస్తున్నారనే విషయాలను తెలుసుకునేందుకు వీలుగా ఈ సదస్సు నిర్వహించినట్టు తెలిపారు.

కాగా, ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలతో పాటు సకాలంలో బిల్లుల చెల్లింపులపై స్పష్టమైన హామీ ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం అందించే ఇన్సెంటివ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ప్రోత్సాహకాన్ని జోడించి ఇవ్వాలని, డ్రిప్ పరికరాలు, హార్వెస్టర్లు, సోలార్ ఫెన్సింగ్, ఇతర ఆధునిక యంత్ర పరికరాలకు సబ్సిడీని వర్తింపజేయాలని ఈ సందర్భంగా రైతులు కోరారు. ఈ సదస్సులో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, సంబంధిత శాఖల అధికారులు, అధిక సంఖ్యలో చెరకు రైతులు పాల్గొన్నారు.


హాజరైన రైతులు

### చెరుకు లాభాసాటి పంట : ఎమ్మెల్యేలు





ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ, రైతులు సంప్రదాయంగా వస్తున్న వరి పంటకు ప్రత్యామ్నాయంగా అధిక లాభాలను అందించే చెరకు పంటను సాగు చేయాలని సూచించారు. ఆధునిక యాంత్రీకరణ అందుబాటులోకి వచ్చి సాగు ఖర్చులు గణనీయంగా తగ్గించు కునే వెసులుబాటు ఉందని, అధిక దిగుబడులను అందించే వంగడాలను విత్తుకుని సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే ముమ్మాటికీ చెరుకు లాభసాటి పంట అని అన్నారు.

### రైతులకు అన్ని విధాల తోడ్పాటు అందిస్తాం



అనంతరం షుగర్ కేన్ కమిషనర్ మల్సూర్ మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు నిజాం షుగర్స్ పునరుద్ధరణకు సంబంధించి ప్రభుత్వం సానుకూల వైఖరితో ముందుకెళ్తోందని అన్నారు. ఈ దిశగా మంత్రులు, ఇతర ప్రజాప్రతి నిధులు, ఉన్నతాధికారులతో కూడిన కమిటీని నియమించగా, ఇటీవలే కమిటీ క్షేత్రస్థాయి సందర్శన జరిపిందని గుర్తు చేశారు. అంతేకాకుండా ప్రభుత్వం సుమారు 190 కోట్ల రూపాయల బకాయిలను కూడా చెల్లించిందని అన్నారు. అయితే కనీసం 16 వేల నుండి 18 వేల ఎకరాల విస్తీర్ణంలో చెరకు పంటను సాగు చేస్తే ఫ్యాక్టరీలో క్రషింగ్ జరపవచ్చని సూచించారు. చెరకు సాగుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం తరఫున సబ్సిడీపై విత్తనాలను సమకూర్చడంతో పాటు అన్ని విధాలుగా తోడ్పడును అందిస్తామని అన్నారు. ఫ్యాక్టరీ పరిధిలోని ఆయా గ్రామాల రైతుల నుండి చెరకు పంట సాగు చేసే విషయమై అభిప్రాయాలను సేకరించి, స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్లాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.

## అంధులకు అక్షర ప్రదాత.. లూయిా బ్రెయిలీ

- జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి


బ్రెల్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అంధుల కోసం లూయిా బ్రెల్ ప్రత్యేకంగా బ్రెయిలీ లిపిని కనుగొన్న అక్షర ప్రధాత అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో లూయిా బ్రెల్ 216వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటం ముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంధుల సౌకర్యార్థం విద్యను అభ్యాసించుటకు బ్రెయిలీలో అక్షరాలను కనుగొన్న వ్యక్తి అని అన్నారు. దివ్యంగులకు, అంధులకు ప్రభుత్వం చేయూత నిస్తున్నదని తెలిపారు. ఎన్నికల్లో అంధులు తమ ఓటు హక్కు వినియోగించుకొనుటకు బ్రెయిలీ లిపిలో బ్యాలెట్ పేపర్‌ను ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాలో ప్రత్యేకంగా గ్రంథాలయం ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ వారిచే బ్రెయిలీ లిపి లో ప్రచురించబడిన బ్రెల్ క్యాలెండర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, సి.డి.పి.ఒ. రోచిష్మ , దివ్యంగుల సంఘాల ప్రతినిధులు చిప్ప దుర్గాప్రసాద్, బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూం ఇండ్ల మరమ్మతులు సకాలంలో పూర్తి చేయాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూచన
- ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష..
- రోడ్లపై గుంతలు పూడ్చాలని ఆదేశం


రోడ్లు, భవనాల శాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.1.25 కోట్లతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను బ్లాక్ వైస్ విభజించి వీలైనంత త్వరగా మరమ్మతులు ప్రారంభించి పనులు పూర్తి చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. సుభాష్‌నగర్‌లోని అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్అండ్‌బీ అధికారులతో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నగరంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులపైన అధికారులతో చర్చించి తగు సూచనలు తెలిపారు. నాగారం, కలెక్టరేట్ బైపాస్‌లో నిర్మించిన 648 డబుల్ బెడ్ రూమ్‌ల మరమ్మతులకు ఇటీవల ప్రభుత్వం నుంచి విడుదలైన 1.25 కోట్లతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను బ్లాక్ వైస్ విభజించి వీలైనంత త్వరగా మరమ్మతులు ప్రారంభించి పనులు పూర్తి చేయాలనీ సూచించారు. నగరంలో వర్ని రోడ్ నుండి నాగారం వరకు, బస్వాగార్డెన్ రోడ్, రాజీవ్‌గాంధీ సర్కిల్ నుండి దత్తాత్రేయ గుడి వరకు మంజురైన నాలుగు రోడ్ల నిర్మాణం, దత్తాత్రేయ గుడి బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని, పనులు నాణ్యతతో చేపట్టాలని అధికారులు, కాంట్రాక్టర్లు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. నగరంలో రోడ్డు మరమ్మతులు జరగడం లేదని గుంతలు పడ్డ రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో గుంతలు పుడ్చాలని ఆదేశించారు.

# యాసంగి సాగుకు పోచారం ప్రాజెక్టు నీటి విడుదల

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్


నీటిని విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

యాసంగి పంటలు సాగు చేయడానికి పోచారం ప్రాజెక్టు ద్వారా శనివారం ఆర్డిఓ ప్రభాకర్, ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్ర రెడ్డి , ఇరిగేషన్ ఎస్సీ విద్యావతి తో కలిసి ప్రాజెక్టు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోచారం ప్రాజెక్టు ద్వారా పదివేల ఐదు వందల ఎకరాలకు ఏ జోన్ రైతుల కోసం 44 డిస్ట్రిబ్యూటర్ల వరకు నీటిని వదిలినట్లు వారు తెలిపారు. ప్రస్తుతం పోచారం ప్రాజెక్టులో 1.6 టీఎంసీ నీరు నిలువ ఉందని వెల్లడించారు. 15 రోజులు నీటి విడుదల చేసి తర్వాత పది రోజుల పాటు నిలిపివేయను న్నట్టు తెలిపారు. ఐదు వేట్టింగ్‌ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఈఈఈ మల్లేష్, డిఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ అక్షయ్, ఎంపీడీవో ప్రభాకర్ చారి, తాసిల్దార్ శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ ఏడిప రత్నం, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ చైర్మన్ అఖిడి గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మైనార్టీ అధ్యక్షుడు ఇమామ్, యూత్ అధ్యక్షుడు శ్రీరాం గౌడ్, ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ గౌడ్, నాయకులు నరసింహారెడ్డి, ఫారూఖ్ సాబ్, డైరెక్టర్ నగేష్, గోపాల్, వసురం, కుమార్, నర్సా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


బ్రిడ్జీ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

### బ్రిడ్జి నిర్మాణ స్థల పరిశీలన

పోచారం ప్రాజెక్టుపై నిర్మించనున్న బ్రిడ్జి స్థలాన్ని శనివారం రోజు ఇరిగేషన్ ఎస్సీ విద్యావతి, ఈ ఈ మల్లేష్, డి ఈ ఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ హైవే రోడ్డు పనులు కొనసాగుతూ ఉండటంతో నూతనంగా పోచారం ప్రాజెక్టు వాటర్ ప్రవహించే నీటి వద్ద బ్రిడ్జి నిర్మాణం నూతనంగా ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. బ్రిడ్జి ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించినట్లు వారు తెలిపారు.

## కోడి పందేల స్థావరాలపై దాడి.. కేసు నమోదు

నవతెలంగాణ-ఆర్మూర్



విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణంలోని దూదేకుల కాలనీలో డబ్బులు పెట్టి కోడి పందేలు ఆడుతున్న 13 మందిని పట్టుకున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ గౌడ్ శనివారం తెలిపారు. వారి నుండి కోడి కత్తులు, రూ.7380 నగదు, 11 సెల్‌ఫోన్‌లు, 4 పందెం కోళ్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## బొమ్మ మహేష్‌ను కలిసిన ప్రైవేట్ డిగ్రీ, పీజీ, కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్

నవతెలంగాణ-కంఠేశ్వర్


పీసీసీ చీఫ్‌ను సన్మానించిన ప్రతినిధులు

ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కోరారు. శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టిపిసిసి మహేష్ కుమార్ గౌడ్‌తో ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలలో గత రెండు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయా లని కోరారు. అందుకు మహేష్ కుమార్‌గౌడ్ వెంటనే స్పందించి సాధ్యమైనంత త్వరలో విడుదల చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

## శాఖ గ్రంథాలయాల అభ్యున్నతికి కృషి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ చంద్ర కాంత్ రెడ్డి

నవతెలంగాణ-పిట్లం


చంద్రకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గ్రామీణ ప్రాంత శాఖ గ్రంథాలయాల అభ్యున్నతికి కృషి చేస్తానని కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శాఖ గ్రంథాల యాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల శాఖ గ్రంథాలయాలకు మౌలిక సదుపాయాలు , పాఠకులకు అన్ని రకాల దిన పత్రికలతో పాటు , వీక్లీ , మాస పత్రికలను , నవలలు , తెలంగాణ సాంస్కృతిక , ఆవిర్భావ కథాంశాలను ప్రతి శాఖ గ్రంథాలయాలలో అందుబాటులో ఉండేలా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో చర్యలు చేపడతామన్నారు. ఆయన మండల కేంద్రానికి మొదటిసారిగా విచ్చేయడంతో స్థానిక నాయకులు భేటీ అనంతరం శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మా రెడ్డి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామ్ రెడ్డి, హన్మాండ్లు, మోహన్‌రెడ్డి, కుమ్మరి రాములు, మార్గాల దయానంద్, హిమ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
ఆదివారం | జనవరి 05, 2025 | www.navatelangana.com



## మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

**నవతెలంగాణ-బాల్కొండ**

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2025-2026 సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో సీట్ల కోసం, అలాగే 7,8,9,10వ తరగతులలో మిగిలి ఉన్న ఖాళీ సీట్ల కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ శనివారం పేర్కొన్నారు. ఈ నెల 6 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మంచి నాణ్యత గల ఇంగ్లీష్ మీడియం బోధన, మంచి అనుభవం కలిగిన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్య బోధన ఉంటుందని సూచించారు. ఉచిత యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, ప్రభుత్వ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా లేదా మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 13.04.2025న ఈ ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

## నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

**నవతెలంగాణ-ముప్కాల్**



ముప్కాల్ బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు ముస్కు భూమేశ్వర్‌రెడ్డి సమక్షంలో శనివారం ఉదయం మండల కేంద్రంలో నవతెలంగాణ 2025-క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎత్తిచూపుతూ సమస్యల పరిష్కారంలో ముందున్న ప్రత్రిక నవతెలంగాణ దినపత్రిక అని కొనియాడారు. నవతెలంగాణ పాఠకులకు, సిబ్బందికి, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యులు మునిరోద్దీన్, శ్రీనివాస్ గౌడ్, కుమ్మరి సుఖిదాస్, దాసరి నర్సింగ్ దాస్, ఓజా ప్రకాష్, ముఖిద్, గద్దల రమేష్, లింగపురం చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిన్న ప్రాణానికి పెద్ద కష్టం

- అనారోగ్యంతో అవస్థ పడుతున్న రెండు నెలల చిన్నారి
- 'బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్' ఆపరేషన్ చేయాలన్న వైద్యులు
- ఇప్పటికే రూ.4.50లక్షలు ఖర్చుచేసిన నిరుపేద కుటుంబం
- మరో రూ.15లక్షలు అవసరమని చెప్పిన వైద్యులు
- దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు



**నవతెలంగాణ-ముప్కాల్**

చిన్న ప్రాణానికి పెద్ద కష్టమొచ్చింది. రెండు నెలల చిన్నారి తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చిన్నారి చికిత్స కోసం తల్లిదండ్రులు ఇప్పటికే రూ.4.50 లక్షలు ఖర్చు చేశారు. అయితే వైద్యులు 'బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్' ఆపరేషన్ చేయాలని సూచించారు. అందుకు గానూ రూ.15లక్షలు అవసరమని తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో దాతలు తమ బిడ్డ ప్రాణాలు కాపాడేందుకు ఆర్థికసాయం చేయాలని వేడుకుంటున్నారు.

నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన (వినయ్-నివేదిత) దంపతులకు రెండు నెలల పాప ఉంది. ప్రస్తుతం పసిపాప హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఇప్పటివరకు బాధిత కుటుంబ సభ్యులు రూ.4.50 లక్షలను చికిత్స కోసం ఖర్చు చేశారు. ఆ పసిపాపకు 'బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ ఆపరేషన్' చేయాలని వైద్యులు తెలిపారు. అందుకుగానూ వైద్యం ఖర్చులు రూ.15 లక్షలు అవసరమని డాక్టర్‌లు చెప్పడంతో పాప తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో మానవత్వంతో దాతలు ముందుకు వచ్చి పసిప్రాణానికి అండగా నిలవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఆదుకోవాల్సిన దాతలు 8179417494 నెంబర్‌కు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా అందుకోవాలని కోరుతున్నారు.

## ఆర్థిక సాయం అందజేత

**నవతెలంగాణ-ముప్కాల్**

మండల కేంద్రానికి చెందిన వినయ్-నివేదిత దంపతుల పాప ప్రాణాపాయ విషయం తెలుసుకున్న ముప్కాల్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి శనివారం తనవంతు సాయంగా రూ.5,000 బాధిత కుటుంబానికి అందజేశారు. దాతలు ముందుకు వచ్చి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. చిన్నారి కుటుంబ సభ్యులు ముస్కు భూమేశ్వర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యులు మునిరోద్దీన్, శ్రీనివాస్ గౌడ్, కుమ్మరి సుఖిదాస్, దాసరి నర్సింగ్ దాస్, ఓజా ప్రకాష్, ముఖిద్, గద్దల రమేష్, లింగపురం చిన్నయ్య తదితరులు ఉన్నారు.



ఆర్థికసాయం చేస్తున్న మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు

# పేదల పక్షాన నవతెలంగాణ

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

**నవతెలంగాణ-ఆర్మూర్**

బడుగు బలహీన పేదల పక్షాన కథనాలు రాసే ఏకైక పత్రిక నవతెలంగాణ అని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అంకాపూర్ గ్రామంలోని ఎమ్మెల్యే స్వగృహంలో నవతెలంగాణ 2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పత్రికలు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా ఉండాలని, పేద ప్రజల పక్షాన ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో ముందున్న పత్రిక నవతెలంగాణ అన్నారు. పేదల పక్షపాతిగా భవిష్యత్తులో సైతం పనిచేయాలని తెలిపారు. నవతెలంగాణ దినదినాభివృద్ధి చెందుతూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అవినీతి, అన్యాయాలను ఎదిరిస్తూ ప్రజలను చైతన్య వంతులుగా చేయడంలో పత్రికలు ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సి ఇంచార్జ్ రిపోర్టర్ సొక్కాల తిరుపతి, డీ.సి.సురేష్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, ఓబిసి జిల్లా అధ్యక్షులు యామాద్రి భాస్కర్, జెస్సు అనిల్ కుమార్, పొల్కం వేణు, పిప్రి రోహిత్‌రెడ్డి, అంకాపూర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సునీల్ రెడ్డి

**నవతెలంగాణ-ఏర్గట్ల**

మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నవదీప్ వాళ్ళ నాన్న ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో అతని కుటుంబాన్ని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌రెడ్డి శనివారం పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను, సుదర్శన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



బొమ్మ మహేష్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**నవతెలంగాణ-ఏర్గట్ల**

టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్ మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం పనిచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలకు పథకాల గురించి వివరించి, పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నట్లు తెలిపారు. వీరి వెంట ఏర్గట్ల యూత్ కాంగ్రెస్ నాయకులు మునిమాణిక్యం అజయ్ ఉన్నారు.

## అగ్ని ప్రమాదానికి గురైన ఇంటిని పరిశీలించిన ముత్యాల సునీల్ కుమార్



బాధితులతో మాట్లాడుతున్న ముత్యాల సునీల్‌కుమార్

**నవతెలంగాణ-బాల్కొండ**

మండల కేంద్రంలో ఇటీవల నడిమిగల్లికి చెందిన పల్లికొండ చిన్ననర్సయ్య-లక్ష్మీ దంపతుల నివాస గృహం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాద ఘటనపై బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ శనివారం కాలిపోయిన ఆ ఇంటిని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని ఇందిరమ్మ ఇల్లు కేటాయించి వారి కుటుంబాన్ని ఆదుకుంటామని ముత్యాల సునీల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

**నవతెలంగాణ-ముప్కాల్**

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని టూ వీలర్, త్రి వీలర్ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని శనివారం ఉదయం "ఆర్మూర్ ఆర్టీవో" సూచనల మేరకు ముప్కాల్ ఏఎస్సై సురేష్ ఆధ్వర్యంలో ఆ వాహన యజమానులకు తగు సూచనలను అందించారు. రోడ్డుపై జీబ్రా క్రాసింగ్, చౌరస్తా, మలుపుల వద్ద ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలన్నారు. ఆటో నడిపే సమయంలో ఆటోలో ప్రయాణించే వారి కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని వాహనం నడపాలని సూచించారు. అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. కార్యక్రమంలో ముప్కాల్ ఏఎస్సై సురేష్, ఆర్టీవో అధికారులు, స్థానిక పోలీసు సిబ్బంది, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను, వారి పనితీరును పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన ఆయన విద్యార్థులతో పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. వంటగదిని పరిశీలించిన ఆయన పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని తయారు చేయాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. పాఠశాలకు సరఫరా జరిగిన మధ్యాహ్నం భోజన సరుకులను పరిశీలించారు. పాఠశాలకు అందించే మధ్యాహ్న భోజనం సరుకుల్లో నాణ్యత లేకపోతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నరసయ్య, తదితరులున్నారు.



జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

# విద్యార్థులకు ఉచితంగా గణిత స్టడీ మెటీరియల్ పంపిణీ

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజ శ్రీనివాస్ చేతుల మీదుగా శనివారం గణిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ మాట్లాడుతూ యస్.సి.ఈ.ఆర్.టీ తెలంగాణా సంస్థ విడుదల చేసిన మార్చ్ 2025 పదవ తరగతి పరీక్షల బ్లూ ప్రింట్‌కు అనుగుణంగా తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కందికొండ శ్రీనివాస్, నిష్ణాతులైన ఉపాధ్యాయులు గణిత స్టడీ మెటీరియల్ తయారు చేశారన్నారు. 60 రోజుల్లో 10వ తరగతికి చెందిన అన్ని పాఠ్యాంశాలు, విద్యా ప్రమాణాలు పూర్తి అయ్యేవిధంగా విద్యార్థులు సన్నద్ధం కావాలని అన్నారు. నూతన ప్రశ్నాపత్రం నమూనాకు అనుగుణంగా విద్యార్థులు తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు వచ్చే విధంగా గణితాన్ని ప్రాక్టీస్ చేయడం ద్వారా 10/10 జీపీఏ సాధించవచ్చన్నారు. స్వల్ప, అతి స్వల్ప ప్రశ్నలకు చాయిస్ ఉండదని, కేవలం వ్యాసరూప ప్రశ్నలకు మాత్రమే ఇంటర్నల్ ఛాయిస్ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శ్రేణిలో మార్కులు సాధించి ఐఐఐటి బాసరలో సీట్లు తెచ్చుకోవాలని సూచించారు. గత పది సంవత్సరాలుగా పనిచేస్తున్న స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గణిత స్టడీ మెటీరియల్ అందించడం ద్వారా 100 శాతం రిజల్ట్ వస్తుందని, తన స్వంత డబ్బులు రూ.4వేలతో పదవ తరగతి చదువుతున్న మొత్తం 25 మంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, భాస్కర్, రామకృష్ణ, అరవింద్, హైమవతి, గీత, తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు స్టడీ మెటీరియర్‌ను అందజేసిన ఎంపీడీవో

# యూనివర్సిటీలో ఖేల్ ఉత్సవాలు

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా చేపట్టే యువజనోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు అమృత్ చారి మాట్లాడుతూ.. విద్యార్థులు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్ళాలని అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే యువత పాత్ర ముఖ్యమని.. అందుకే యువత శారీరకంగా బలంగా ఉండాలని అన్నారు. ఖేల్ ఉత్సవ్ పేరిట నిర్వహించే ఈ వారోత్సవాలు ఈ నెల 4 నుంచి 5 వరకు రిజిస్ట్రేషన్, 6 నుంచి 10వ తేదీ వరకు ఖేల్ ఉత్సవాలు కొనసాగుతాయని వివరించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే వివిధ క్రీడా పోటీలు సైతం నిర్వహించనున్నారు. క్రీడలకు సంబంధించి సమాచారం వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, వైస్ ప్రెసిడెంట్ పావనిని సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోహన్, పావని, సమీర్, అనిల్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎబివిపి నాయకులు

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

**నవతెలంగాణ-భీంగల్ రూరల్**

మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. గ్రామాలు, వార్డుల్లో సర్వేయర్లు వివరాలను సేకరిస్తున్నారు. పల్లికొండ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేసిన ఇండ్లలో 5శాతం పున్ణ పరిశీలన జరిగిందని, మొత్తంగా ఏడు ప్రశ్నలకు తోడుగా అనుబంధ ప్రశ్నల ద్వారా వివరాలను ఎంట్రీ చేస్తున్నారు. ఇక ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పర్యవేక్షించేందుకుగాను అధికారులను నియమించారు. వీరంతా కూడా స్కీమ్ అమలును పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. యాప్‌లో నమోదు చేసే వివరాల ఆధారంగా.. దరఖాస్తుదారుడు అర్హులా? కాదా? అనేది వెల్లడవుతుందని భీంగల్ ఎంపీడీవో సంతోష్ కుమార్, సెక్రటరీ రామ్ మోహన్ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు వివరించారు.

## శ్రీలక్ష్మి రెడీమిక్స్ కాంక్రీట్ కంపెనీలో జనరేటర్‌పై పెట్రోల్ పోసి నిప్పు



కాలిపోయిన జనరేటర్

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నడ్పల్లి మామిడి గ్రామ శివారులో గల శ్రీలక్ష్మి రెడీమిక్స్ కాంక్రీట్ కంపెనీలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి అక్కడ గల జనరేటర్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు ఎస్‌హెచ్ఓ మోహమ్మద్ షరీఫ్ శనివారం తెలిపారు. గతంలో శ్రీలక్ష్మీ రెడ్డిమిక్స్ కంపెనీలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి ఆ కంపెనీ ఆపరేటింగ్ క్యాబిన్‌కు నిప్పంటించారని, ఈ విషయమై శ్రీ లక్ష్మీ రెడిమిక్స్ కాంక్రీట్ కంపెనీ యాజమాని వేణిగళ్ల వేణు మాధవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఘటనకు సంబంధించి అనుమానితులను విచారించి తదుపరి చట్టరీత్యా చర్యలను తీసుకోనున్నట్టు పోలీసులు తెలిపారు.

## విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



మాట్లాడుతున్న ఎసిపి శ్రీనివాస్

**నవతెలంగాణ-బోధన్ టౌన్**

జాతీయ రహదారి భద్రత మహోత్సవాల సందర్భంగా బోధన్ రాకాసిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు ట్రాఫిక్ మహోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ రీజినల్ సెక్రటరీ లంక రవికుమార్, ఏసిపి శ్రీనివాస్, బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు పి.బాలచంద్రం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా పాటించాల్సిన నియమాలను వివరించారు, సీటు బెల్టు పెట్టుకోవడం, హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ సిగ్నల్స్ సూచనలు పాటించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను తమ తమ కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు 18 సంవత్సరాలు నిండని వారు వాహనాలు నడపవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేష్ బాబు, సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షులుగా కట్ట మహేష్ యాదవ్

**నవతెలంగాణ-ముప్కాల్**



ముప్కాల్ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షులుగా కట్ట మహేష్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో సంఘం అధ్యక్ష బాధ్యతలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. సెక్రెటరీగా శ్రీనివాస్, క్యాషియర్ గొల్ల హన్మాండ్లు, కార్యవర్గ సభ్యులుగా బొట్ల రాజన్న, గొర్రె చిన్న రాజన్న, జంగిడి రాజును ఎన్నుకున్నారు. నూతన సంఘం కార్యవర్గం సభ్యులకు సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



**నవతెలంగాణ-లింగంపేట్**

లింగంపేట్ మండలంలోని నల్లమడుగు గ్రామంలో (సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్) స్వచ్ఛంద సంస్థ కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎస్-ఎస్టి స్వచ్ఛంద సంస్థ కౌన్సిలర్ మన్నె క్రిష్ణ మాట్లాడుతూ, పొదుపు ఏ విధంగా చేసుకోవాలి బ్యాంకుల పైన, బ్యాంకు లలో అందించే సేవల గురించి, అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పైన అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఏటీఎం వాడడం వల్ల ఉపయోగాలు, డిజిటల్ పేమెంట్స్, భీమా పథకాలు, పైన అలాగే సుకన్య సమృద్ధి యోజన పథకాల పైన అవగాహన కల్పించారు ఇట్టి కార్యక్రమంలో గ్రామ హెల్త్ వర్కర్ అనిత, మంజుల పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శికి సన్మానం



**నవతెలంగాణ-మద్నూర్**

మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్చార్జి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌కు మద్నూర్ మండలంలోని కరగ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాధవరావు పాటిల్ శనివారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న శ్రీకాంత్ మార్కెట్ కమిటీ అభివృద్ధి గాని వ్యవసాయ రైతులకు గాని అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సూపర్వైజర్లు రామచందర్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కళాశాల తరలిపోవడానికి
# బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యమే కారణం

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్

**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**

మాల్ తుమ్మెద శివారులో గల పాలిటెక్నిక్ అగ్రికల్చర్ కళాశాల తరలిపోవడానికి గత బి ఆర్ ఎస్ నాయకుల నిర్లక్ష్యమే కారణమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వాస్తవాలు తెలుసుకోకుండా బిఆర్ఎస్ నాయకులు అవాకులు చవాకులు పేల్చడం సరికాదని అన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయించిన బిఆర్ఎస్ నాయకులు విద్యార్థులు ఉండడానికి వసతి గృహం సరిగా లేకపోవడంతో విద్యార్థులు మాల్ తుమ్మెద పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లకు ముందుకు రావడంలేదని అన్నారు. ఈ కళాశాల విద్యార్థులను ప్రస్తుతం వేరే చోటికి తరలించడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిపారు.



ఈ విషయంపై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు స్పందించి కళాశాల ప్రిన్సిపల్ మాధవి లతతో పాటు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ జానయ్యతో చర్చించినట్టు తెలిపారు. కాలేజీ తరలిపోకుండా ఆపేందుకు ఎమ్మెల్యే తన వంతు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

### అభివృద్ధిపై చర్చకు సిద్ధం : కాంగ్రెస్ సవాల్

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు చేస్తున్న అభివృద్ధి విషయంలో చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ పార్టీ నాయకులు సవాల్ విసిరారు. గత పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్వహించని అభివృద్ధి కేవలం సంవత్సర కాలంలో కాంగ్రెస్ పార్టీ సాధించిందని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎలాంటి చర్చ కైనా తాము సిద్ధమని బీఆర్ఎస్ నాయకులు చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస రెడ్డి, క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్ర రెడ్డి, యూత్ అధ్యక్షులు శ్రీరామ్ గౌడ్, ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ గౌడ్, సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, నరస గౌడ్, తాండూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు అహ్మద్, గోపాల్, పీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష అట్టలు పంపిణీ



విద్యార్థులకు పరీక్ష అట్టలు అందజేత

**నవతెలంగాణ-తాడ్వాయి**

మండలంలోని పి రుమాయి కుంట తండా పాఠశాల విద్యార్థులకు శనివారం హెల్పింగ్ బ్రిడ్జి ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలు, పెన్నులు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు హేమలత తెలిపారు. చిరంజీవి, శరణీకృత, జన్మదిన సందర్భంగా సుజిత కృష్ణకరావ్ ల ఆర్థిక సాయంతో అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంగరాజ్, రమేష్, సతీష్ అంగన్వాడీ కార్యకర్త గ్రామస్తులు తదితరులున్నారు

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే 99 శాతం పూర్తి



ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

**నవతెలంగాణ-తాడ్వాయి**

ఇందిరమ్మ ఇండ్ల సర్వే 99 శాతం పూర్తయిందని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తెలిపారు. ఆయన శనివారం మండలంలోని దేమీ, కన్‌కల్, కరడు పల్లి, సంఘజీవాడి, చందాపూర్ గ్రామాల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోగల గ్రామాల్లో 8120 నివాస గృహాలు ఉండగా.. సుమారు ఎనిమిది వేల ఇండ్ల సర్వే నమోదు పూర్తి చేసినట్టు తెలిపారు. గ్రామాల్లో లేని కుటుంబీకులను పిలిపించి శతశాతం సర్వే పూర్తి చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ హను మాండ్లు పంచాయతీ కార్యదర్శి సిబ్బంది తదితరులున్నారు.

## రోడ్డు మధ్యలో ప్రమాదకరమైన గుంత



రోడ్డు మధ్యలో గుంత

**నవతెలంగాణ-భిక్కనూర్**

భిక్కనూరు పట్టణ కేంద్రంలో ఉన్న బీటీ రోడ్డు మధ్యలో గుంతలు ఉన్న కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ కేంద్రంలో ఇటీవల కాలంలో డివైడర్ ఏర్పాటు చేసి ఇరువైపులా రోడ్డు విస్తరించారు. రోడ్డు విస్తరణలో భాగంగా మధ్య మధ్యలో చెట్లు అడ్డు రావడం వలన చెట్లను నరికిన తర్వాత రోడ్డు వేయవలసి ఉంది. చెట్లను తీసివేశారు కాని చెట్లు మొదట్లో పూర్తిస్థాయిలో తొలగించకపోవడం, తొలగించిన చోట రోడ్డు సక్రమంగా వేయకపోవడం వంటి కారణాల వలన పూర్తిస్థాయిలో రోడ్డు విస్తరణ పనులు జరగలేదు. రోడ్డు వేసిన చోట కొద్ది రోజులకే గుంతలు ఏర్పడడం వలన గుంతలను తప్పించడానికి రోడ్డు కిందకు బస్సులు, వాహనదారులు దిగి వెళ్లాల్సివస్తుంది. దీంతో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న ప్రజలు ఎక్కడ ప్రమాదం జరుగుతుందో నన్ను భయంతో జంకుతున్నారు. గతంలో రోడ్డు వేసిన తర్వాత గుంతల కారణంగా ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్ అండ్ బి, సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రోడ్డు మరమ్మతం పనులు చేపట్టి గుంతలు లేని రోడ్డును ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుచున్నారు.

# అందుల జీవితాల్లో వెలుగులు నింపిన చీకటి సూర్యుడు లూయీ



కలాం ఉన్న పాఠశాలలో లూయిస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అధికారులు, పాఠశాల బృందం

**నవతెలంగాణ-గాంధారి**

మండలంలోని గౌరారం కలాం ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి శ్రీహరి ఆధ్వర్యంలో ప్రపంచ బ్రేలీ దినోత్సవం ఘనంగా శనివారం నిర్వహించారు. ముందుగా లూయిస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి శ్రీహరి మాట్లాడుతూ.. లూయిస్ నిరుపేద కుటుంబంలో పుట్టి వీధి వక్రీకరించి కంటికి గాయమై నాలుగేళ్లకే కంటిచూపు పోగొట్టుకున్నారని తెలిపారు. అందమైన లోకాన్ని తానిక చూడలేనని కుమిలిపోకుండా తాను చదువుకుంటూ అందులకు వెలుగులు నింపాలనే సంకల్పంతో బ్రెయిలీని 1819లో లూయిస్ నెపోలియన్ ఆర్మీ కోసం రూపొందించిన నైట్ రైటింగ్ సిస్టంను గురించి తెలిసి దాని ఆధారంగా 1824లో 6 పాయింట్ల నుంచి వివిధ సమీకరణాల ద్వారా అక్షరాలు, అంకెలు ఇతర చిహ్నాలను సృష్టించాడు. ఈ పద్ధతి అందులకు తాము చదవగలగడం, రచన చేయగలగడం అనే స్వేచ్ఛను అందించాయని యంఇఓ తెలిపారు. అందులకు ఆత్మస్థైర్యం నింపిన లూయిస్ బ్రెయిలీ జీవిత కథ అందుల కోసం మాత్రమే కాదు సాధరణ వ్యక్తులకు కూడా పెద్ద ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ బ్రెయిలీ దినోత్సవాన్ని ప్రపంచంలోని అన్ని దేశాలు ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయని ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎం. పెంటయ్య తెలిపారు. కార్యక్రమంలో అనిత, సత్యం, ఫౌజియా, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## తపస్ ఉపాధ్యాయ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఉపాధ్యాయ బృందం

**నవతెలంగాణ-జుక్కల్**

మండలంలోని తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో 2025 నూతన క్యాలెండర్‌ను తపస్ యూనియన్ ఉపాధ్యాయ బృందం శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలం తపస్ ఉపాధ్యాయ యూనియన్ మండల అధ్యక్షులు జై చంద్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా నూతన క్యాలెండర్‌ను తపస్ ఆధ్వర్యంలో ఆవిష్కరిస్తున్నట్టు తెలిపారు. ఈ సంవత్సరం ప్రత్యేకంగా మారుమూల ప్రాంతమైన జుక్కల్ మండల కేంద్రంలో బస్వాపూర్ గ్రామంలోని ఎంఎపీ యూపీఎస్ పాఠశాలలో ఆవిష్కరించడం గొప్ప విశేషయమన్నారు. కార్యక్రమంలో తపస్ యూనియన్ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ పనులు పునఃప్రారంభిస్తాం



మాట్లాడుతున్న పలువురు

**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్**

మండల కేంద్రంలోని నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ పనులు నిలిచిపోవడంతో శనివారం రోజున గ్రంథాలయ జిల్లా చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. గత ప్రభుత్వంలో పనులు ప్రారంభించినప్పటికీ నిధుల కొరతతో భవన నిర్మాణం ఆగిపోయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆధునిక టెక్నాలజీ వచ్చినప్పటికీ టెక్నాలజీలో దొరకని విలువైన పుస్తకాలు గ్రంథాలయంలో దొరుకుతున్నాయని నిధుల కొరతతో ఆగిపోయిన నిర్మాణాన్ని పూర్తిచేసే విధంగా అధికారుల దృష్టికి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే భవనం పూర్తయ్యే విధంగా కృషి చేస్తానని ఆయన అన్నారు.

అదేవిదంగా మండల బీజేపీ నాయకులు రమేష్, తానాజీ రావు కలిసి గ్రంథాలయం లో కనీసం న్యూస్ పేపర్స్ కూడా రావడం లేదని, అదే విధంగా గ్రామం లో దాదాపుగా 100 మంది నిరుద్యోగులు పోటీపరీక్షలకు సిద్ధమవుతున్నారని కానీ వారికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో లేవని తెలిపారు. వెంటనే చైర్మన్ స్పందించి వారం రోజులో తన వంతు కృషి చేస్తానని మాట ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మోహన్, కల్లూరి పండరి,సంతోష్ దేశాయ్, బస్వరాజ్ దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చిన హమాలీలు




మాట్లాడుతున్న హమాలీ కార్మికులు

**నవతెలంగాణ-కామారెడ్డి**

తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ సివిల్ సప్లై హమాలీలు (ఏఐటీయూసీ) చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 4వ రోజుకు చేరుకుంది. హమాలీలు కామారెడ్డి ఆర్డిఓ కార్యాలయం నుండి తమ సమస్యలు పరిష్కరించాలని ర్యాలీగా బయలుదేరి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి బాలరాజు మాట్లాడుతూ ఎగుమతి దిగుమతి రేట్లు 29 రూపాయలు ఇవ్వాలని గత అక్టోబర్ లో 18 వ తారీఖున సివిల్ సప్లై రాష్ట్ర కమిషనర్ చౌహాన్ కు సమ్మె నోటీసు ఇచ్చినట్టు తెలిపారు. సమస్యల పరిష్కరిస్తామని హామీ వచ్చినా.. గత మూడు సంవత్సరాలుగా 26 నుండి 29 రూపాయలు పెంచవలసిన ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వము మర్చిపోయిందన్నారు. ఇప్పటికైనా జిల్లా ఇన్చార్జి మంత్రి, సివిల్ సప్లై రాష్ట్ర అధికారులు స్పందించి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు .ఎల్. దశరథ్, సివిల్ సప్లై హమాలీ నాయకులు బీరయ్య, కృష్ణ, గంగరాజు, బాజీ, సంపత్, మహేష్, ఎల్లేశం, ప్రవీణ్, కే సాయిలు, రాజశేఖర్, ప్రసాద్, బాలమల్లు, భీమయ్య పద్మ శ్రీకాంత్, లింబాద్రి, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కాలేజీలో సావిత్రిబాయి పూలే జయంతి



**నవతెలంగాణ-జుక్కల్**

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రి భాయ్ పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాలలో ఉందు ఉండాలి, ఆమె ఆలోచన విధానం మనలో చిరకాలం నిలిచి పోవాలని తెలిపారు. అనంతరం చిత్ర పటానికి పూల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జుక్కల్ మండల అధ్యక్షులు షేక్ ఫిర్దోస్, నాయకుడు సతీష్, జామిల్ నిఖిత, పల్లవి విద్యార్థులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న పలువురు

**నవతెలంగాణ-నిజాంసాగర్**

సమగ్ర శిక్షా ఉద్యోగులు వారి డిమాండ్లను సాధించడం కొరకు గత 26 రోజులుగ సమ్మె చేస్తున్న కారణంగా వారికి ఆర్థిక చేయూత కోసం మండలంలోని వడ్డేపల్లి ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున ఉపాధ్యాయులు రామదాసు (ఎస్‌జిటి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల ఉపాధ్యాయులు) తన వంతుగా సమగ్ర శిక్ష ఉద్యోగులకు 4000 రూపాయలను ఆర్థిక సహాయం అందించారు. ఆయనకు నిజాంసాగర్ మండలం సమగ్ర శిక్ష ఉద్యోగుల శాఖ తరుపున ఉపాధ్యాయుడు రాందాస్‌కు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష మండల ఉద్యోగులు బి శ్రీధర్ కుమార్, ఎం. వరలక్ష్మి, పి. నర్సింలు, ఎం. వెంకట్రామ్, గౌడ్ జె. రాజు పాల్గొన్నారు.

## పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కఇంచిన పీఆర్టీయూ నాయకులు

**నవతెలంగాణ-దోమకొండ**

దోమకొండ మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో రాష్ట్ర పిఆర్టియు ప్రధాన కార్యదర్శి గా దామోదర్ రెడ్డి ఎన్నికైన సందర్భంగా మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ శాలువ తో శనివారం సన్మానం చేశారు. అనంతరం పీఆర్టీయూ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో దోమకొండ పిఆర్టియు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ సభ్యులు మహేందర్, వెంకటరెడ్డి, యశ్వంత రావు మరియు మండల కార్యదర్శి బోడరాజు, ప్రధానోపాధ్యాయురాలు రాధాలక్ష్మి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కదిరే గోపాల్ రెడ్డి ఉపాధ్యాయుని ఉపాధ్యాయురాలు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయం అభివృద్ధి కోసం విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న శోభన-అనిల్

**నవతెలంగాణ-దోమకొండ**

దోమకొండ మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయంలోని సాలరం నిర్మాణం కోసం గడి కోట ట్రస్ట్ సభ్యులు కామినేని శోభన - అనిల్ కుమార్ 5 లక్షల రూపాయలు చెక్కును ఆలయ కమిటీ అధ్యక్షులు పెద్దిరెడ్డి సిద్ద రెడ్డి,కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. ఆలయం ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారి ప్రసాదం దాతలకు అందజేసి శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం కమిటీ అధ్యక్షులు పెద్దిరెడ్డి సీద్దా రెడ్డి మాట్లాడుతు ఆలయం అభివృద్ధి కోసం దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, నాయకులు అబ్రబోయిన స్వామి, పున్న లక్ష్మన్, మాజీ సర్పంచ్ అంజలి,ఆలయ కమిటీ ధర్మకర్తలు పూలబోయిన రమేష్,గ్రామ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీతాయిపల్లి గ్రామ బూత్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

**నవతెలంగాణ-గాంధారి**

మండలంలోని సీతాయి పల్లి గ్రామ బూత్ కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఓబిసి మండల మోర్చా అధ్యక్షుడు నాందేవ్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. భారతీయ జనతాపార్టీ గ్రామ అధ్యక్షనిగా చెంచాల గంగరాజు, ఉపదక్షులుగా దుంపల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా దుంపల రాజశేఖర్, కార్యదర్శులుగా సింగసాని ప్రశాంత్, రావుల శ్రీకాంత్, పలుసుపుల రాజు, సంజయ్, మహేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## డ్రోన్ ద్వారా కలుపు మందు పిచికారీ



డ్రోన్ ద్వారా పిచికారీ నిర్వహిస్తున్న పలువురు

**నవతెలంగాణ-రామారెడ్డి**

మండల కేంద్రంలో శనివారం వెదజల్లే వరి సాగులో డ్రోన్ ద్వారా కలుపు మందు పిచికారిని చేశారు. ఈ సందర్భంగా ఏఈఓ రాకేష్ మాట్లాడుతూ.. వెదజల్లే పద్ధతి సాగులో పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని, రైతుకు దిగుబడి పెరిగి లబ్ధి పొందుతారని సూచించారు. తక్కువ సమయంలో డ్రోన్ ద్వారా పంటలకు కలుపు మందులతో పాటు, తెగుళ్ల నివారణకు రసాయన ఎరువుల తక్కువ మందుతో పిచికారి చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ యుపిఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుల సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన పలువురు

**నవతెలంగాణ-జుక్కల్**

మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఎంపీ యుపిఎస్ పాఠశాల హెచ్ఎం జైచంద్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా టీచర్లను ఘనంగా శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందించారు. అనంతరం హెచ్ఎం జై.చంద్ మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే మహిళలకు ఆదర్శంగా నిలిచి ఉపాధ్యాయురాలిగా పేదలకు విద్యను అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
ఆదివారం | జనవరి 05, 2025 | www.navatelangana.com


## పిల్లల పట్ల అశ్రద్ధ వహిస్తే ఊరుకునేదే లేదు


భోజనాన్ని పరిశీలిస్తున్న విద్యాధికారి

నవతెలంగాణ-భీంగల్ రూరల్

పిల్లల పట్ల అశ్రద్ధ వహిస్తే ఊరుకునేదే లేదని మండల విద్యాధికారి స్వామి తెలిపారు. మండలంలోని మెండోరా గ్రామంలో మండల పరిషత్ ఎంపిపిఎస్ తెలుగు మీడియం స్కూల్, ఉర్దూ మీడియం పాఠశాలను తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థి కనీస సామర్థ్యాలు వచ్చేలా కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న 'తొలిమెట్టు'కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. తరగతి గదిలో బోధన విధానాన్ని పరిశీలించారు. పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం రుచిగా వండుతున్నారో లేదో.. విద్యార్థులను అడిగి కనుక్కున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్తెన్న, ఉపాధ్యాయులున్నారు.

## ఉద్యోగ విరమణ చేసిన పోలీసు సిబ్బందికి వీడ్కోలు



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ శాఖలో డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ఉద్యోగ విరణమ పొందిన వారికి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శనివారం శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్బంగా నిజామాబాద్ అదనపు డి.సి.పి (అడ్మిన్) జి.బస్వారెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో ఎంతో పని ఒత్తిడితో విధులు నిర్వహించి, ఎలాంటి రిమార్కు లేకుండా ఉద్యోగ విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పక ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఎ.సి.పి ఎస్.శ్రీనివాస్‌రావ్, పోలీస్ కార్యాలయం ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, బషీర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, రిజర్వు ఇన్‌స్పెక్టర్స్ శ్రీనివాస్, తిరుపతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## షీ టీమ్‌పై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-బోధన్ టౌన్

పట్టణంలోని మధుమాలాంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాల శక్కర్‌నగర్‌లో షీ టీమ్ అవగాహనా సదస్సును శనివారం నిర్వహించారు. మహిళలపై జరిగే నేరాలు, డయల్ 100, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, తదితర చట్టాలపై, అలాగే సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ విజయ్, పిసి గౌతమ్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు వద్నాల నరేందర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జెంటిల్ కిడ్స్ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జెంటిల్ కిడ్స్ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డేను శనివారం నిర్వహించారు. పాఠశాల కరెస్పాండెంట్ గుజరాతి ప్రకాష్, ప్రిన్సిపాల్ లతా మేడం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ పేరెంట్స్‌కు పాఠశాల తరఫున ఎన్నో కార్యక్రమాలను ఆటల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన గ్రాండ్ పేరెంట్స్‌కు శాలువా, బహుమతులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

- మున్సిపల్ కమిషనర్ రాజు


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో మధ్యాహ్న భోజన తీరు బాగుందని అన్నారు. విద్యార్థులను భోజనం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## టిఎస్ యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన టిఎస్ యుటిఎఫ్ నాయకులు

నవతెలంగాణ-మెండోరా

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఆధ్వర్యంలో క్యాలెండర్, డైరీని మెండోర మండల విద్యాధికారి డి.శ్రీనివాస్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల బాధ్యులు ప్రభాకర్, రమేష్.. ఎంపిడిఓ వనజ, ఎంఈఓలకు టీఎస్ యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఓ.రమేష్, ఉపాధ్యాయులు రాజేశ్వర్, విజయలక్ష్మీ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరత లేదు.. రైతులు అధైర్య పడొద్దు

- మండల వ్యవసాయాధికారి వెంకటేష్

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలో యూరియా కొరత లేదని.. రైతులు అధైర్య పడొద్దని మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ తెలిపారు. ప్రతిరోజు యూరియా సొసైటీలలో, ప్రైవేట్ దుకాణలలో ఉందుబాటులో ఉంటుందని ఆయన సూచించారు. ప్రస్తుతం ధర్పల్లి సొసైటీ లో 20.25 టన్నులు (450 బస్తాలు), హొన్నాజీపేట సొసైటీలో 33.030 టన్నులు (734బస్తాలు), రామడుగు సొసైటీలో 31.05 టన్నులు (690 బస్తాలు) రైతులకు యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ప్రతిరోజు మండలానికి జిల్లా నుంచి యూరియా సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. రైతులు ఆందోళన చెందకుండా తమ పంటకు యూరియా వేయదలచినపుడు మాత్రమే అవసరం మేరకు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు తమ పంటకు కావలసిన యూరియా మొత్తం ఒకేసారి కొనుగులు చేయడం ద్వారా.. అవసరం ఉన్న రైతులకు అందకుండా కృత్రిమ కొరత ఏర్పడే అవకాశం ఉందని, రైతులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తమ పంటకు యూరియా వేయాల్సిన సమయంలో అవసరం మేరకు మాత్రమే కొనుగోలు చేయాలని కోరారు.

మండలంలోని దుబ్బాక గ్రామంలో యూరియా బస్తాల కొరత ఉందని కొందరు అబద్ధపు ప్రచారం చేశారని, అది పూర్తిగా అవాస్తవమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, సొసైటీ చైర్మెన్ చెలిమెల మల్లికార్జున్ అన్నారు. శనివారం వారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రైతులకు కావలసిన ఎరువులు పూర్తి స్థాయిలో ఉన్నాయని, రైతులెవరూ అధైర్యపడొద్దని వెల్లడించారు. కార్యక్రమంలో హొన్నాజీపేట్ సొసైటీ చైర్మెన్ జనార్దన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంగిత్యా నాయక్, నాయకులు భగవాన్‌రెడ్డి, చెలిమెల శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.

## కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటరియంలో నిర్వహిం చిన జిల్లా స్థాయి సైన్స్ క్విజ్-2025 పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్ తెలిపారు. ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలపై జిల్లాస్థాయి సైన్స్ క్విజ్ -2025 ఏర్పాటు చేశారని అన్నారు. జిల్లా స్థాయిలో 71 పాఠశాలల నుంచి 551 విద్యార్థిని విద్యార్థులు పాల్గొనగా కృష్ణవేణి పాఠశాల నుంచి 10మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఇందులో టాప్ టెన్‌లో పావని, స్నేహ (9) ప్రత్యేక బహుమతులను సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా బహుమతుల సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# ప్రజల పక్షపాతి 'నవతెలంగాణ'

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

'నవతెలంగాణ' దిన పత్రిక ప్రజల పక్షపాతి అని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. శనివారం రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నవతెలంగాణ క్యాలెండర్‌ను విష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాటి నుంచి నేటి వరకు ప్రజల సమస్యలను వెలికితీయడంలో నవతెలంగాణ ముందు వరుసలో ఉందని అన్నారు. సమస్యలపై కథనాలు రాస్తూ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తుందని కొనియాడారు. రాబోయే రోజుల్లో పత్రిక మరింత విస్తరించి ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం నవతెలంగాణ సిబ్బందికి, పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ శేఖర్‌గౌడ్, ఇందల్‌వాయి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, తిర్మన్‌పల్లి మాజీ ఎంపిటిసి చింతల కిషన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పోలసని శ్రీనివాస్, నవతెలంగాణ ఉమ్మడి జిల్లా డెస్క్ ఇంచార్జీ మీస మధు, సబ్ ఎడిటర్ క్రిష్ణ, డిజైనర్ దేవేందర్, డిచ్‌పల్లి విలేకరి సయ్యద్ నయీమ్, బోధన్ విలేకరి లింబూరి లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోహమ్మద్ ఇర్ఫాన్, సుధాకర్ నాయక్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.


నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



గ్రామీణ విద్యార్థులు
# ఉన్నత ఆశయాలను కలిగి ఉండాలి

- కాకతీయ సాండ్ బాక్స్ వ్యవస్థాపకులు రాజు రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

గ్రామీణ విద్యార్థులు ఉన్నత ఆశయాలను కలిగి ఉండాలని కాకతీయ సాండ్ బాక్స్ వ్యవస్థాపకులు రాజురెడ్డి అన్నారు. శనివారం ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ, నిజామాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ -2025 పోటీలను నిజామాబాద్ ఖలీల్‌వాడీలో గల రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో విజయవంతంగా నిర్వహించారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి 71 పాఠశాలల నుంచి 552 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా కాకతీయ సాండ్ బాక్స్ వ్యవస్థాపకులు రాజు రెడ్డి పాల్గొన్నారు. విశిష్ట అతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, అడిషనల్ డిసిపి బస్వారెడ్డి, డాక్టర్ విశాల్, రిటైర్డ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సుజనిరెడ్డి పాల్గొన్నారు. అడిషనల్ డిప్యూటీ కమిషనర్ పోలీస్ నిజామాబాద్ బస్వారెడ్డి క్విజ్ ప్రిలిమినరీ పరీక్షపత్రాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులకు 25 మార్కులకు పరీక్ష జరిగింది. విద్యార్థులు డ్రగ్స్ అనర్థాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, తన చుట్టూ ఉన్న వారిని చైతన్యం చేయాలని బస్వారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న రాజురెడ్డి ప్రిలిమినరీ పరీక్షలో మంచి ప్రతిభ చూపిన 6 పాఠశాలలకు చెందిన (12) మంది విద్యార్థులను ఫైనల్ క్విజ్ కోసం వేదిక మీదకు ఆహ్వానించారు. మంచి సమాధానాలు చెప్పిన వారికి బహుమతులను అందజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అవసరం ఉందని ఎక్సైజ్ డిపార్ట్మెంట్ అధికారులను అభినందించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు మల్లారెడ్డి, హనుమంతురావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రభాన్ నాయక్, డాక్టర్ విశాల్ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ కామారెడ్డి జిల్లాల ఎక్సైజ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# 11న గొర్రెపాటి మాధవ రావు సంస్మరణ సభ



నినాదాలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అలుపెరగని మానవ హక్కుల ఉద్యమ బాటసారి, సీనియర్ న్యాయవాది, మానవ హక్కుల వేదిక తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షులు గొర్రెపాటి మాధవ రావుకు సంస్మరణ సభను ఈ నెల 11న ఎల్లమ్మ గుట్టలో నిర్వహించనున్నట్టు పలువురు తెలిపారు. మరణించిన అనంతరం తన కండ్లను, పార్థివదేహాన్ని మెడికల్ కళాశాలకు దానమిచ్చి మరణంలో సైతం ఆదర్శంగా నిలిచారని కామ్రేడ్ మాధవరావును వక్తలు కొనియాడారు. భారత కార్మిక సంఘాల సమైక్య (ఐఎఫ్‌టియు) నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ద్వారకనగర్ కార్యాలయంలో ప్రముఖ న్యాయవాది, జేసిఎస్ ప్రసాద్ ట్రస్ట్, మేనేజింగ్ ట్రస్టీ అమరుడు గొర్రెపాటి మాధవరావు మృతికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు నాయకులు నీలం సాయిబాబా, శివకుమార్ మాట్లాడారు. గొర్రెపాటి మాధవరావు గొంతులేని పేద బడుగు బలహీనవర్గాలకు, తాను గొంతై వారి హక్కుల కోసం ఉద్యమించారని అన్నారు. నగరంలోని ద్వారకనగర్ గుడిసె వాసుల కోసం, శ్రామికనగర్ గుడిసె వాసుల కోసం, పేదల ఇళ్ల స్థలాల కోసం కోర్టుల్లో పోరాడారని తెలిపారు. వారికి ఇళ్ల స్థలాలు ఇతరత్రా సౌకర్యాలు మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించారని తెలియజేశారు. భారత కార్మిక సంఘాల సమాఖ్యకు న్యాయ సలహాదారుడుగా ఉంటూ శ్రామికుల పక్షాన అనేక వేతన ఒప్పందాలకు మార్గదర్శకత్వం చేశారని శ్రామికుల కేసులను కోర్టులో ఉచితంగా వాదించారని తెలియజేశారు. బీడీ కార్మికుల రక్షణ కోసం, వారి వేతన పెంపుదల కోసం యజమాన్యాలతో పూణే, ఔరంగాబాద్, మహారాష్ట్రలో స్వయంగా వేతన చర్చల్లో పాల్గొని బీడీ కార్మికుల పక్షాన నిలిచారని వారి కోసం కోర్టుల్లో ఉచితంగా వాదించారని చెప్పారు. న్యాయవాదిగానే కాకుండా ప్రజల పక్షపాతిగా ఉంటూ అనేక సామాజిక సమస్యలపై రచనలు చేశారని, కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారని తెలియజేశారు.

కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు మరణం పీడిత తాడిత ప్రజానీకానికి శ్రామిక వర్గానికి తీరనిలోటు అని వారి ఆశయ సాధనకు అంకితం అవ్వడమే వారికి ఇచ్చే నివాళి అని అన్నారు. ఈనెల 11 న నగరంలోని ఎల్లమ్మ గుట్టలో జరిగే మాధవరావు సంస్మరణ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, శంకర్, గణేష్, నర్సింగ్ రావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ సప్లై హమాలీల మానవహారం



సమ్మెలో పాల్గొన్న సివిల్ సప్లై, హమాలీ స్వీపర్లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సివిల్ సప్లై హమాలీలు మానవహారం నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సివిల్ సప్లై కార్పోరేషన్ హమాలీ స్వీపర్ల సమ్మె శనివారం 4వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా నిజామాబాద్ నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై ఓమయ్య మాట్లాడుతూ నాలుగు రోజులుగా కార్మికుల సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఒకవైపు అధికారులు జీవో వస్తుందని చెప్పూనే రెండోవైపు దొడ్డిదారిన బియ్యం సరఫరా చేయాలనుకోవడం సరికాదన్నారు. పిట్లం మండల స్టాక్ పాయింట్లు ఎలాంటి సమాచారం లేకుండా బియ్యం బయటకు పోయినట్టు కార్మికుల ద్వారా తెలిసిందని పక్కదారి పట్టించడం కోసం ఈ రకమైనటువంటి విధానాలు అధికారుల అవలంబిస్తున్నారా లేదా మరి ఎవరైనా చేస్తున్నారా అనే అంశంపై గోదాం పై సివిల్ సప్లై కార్పొరేషన్ అధికారులు, విజిలెన్స్ అధికారులు, పోలీసులు దర్యాప్తు చేసి బియ్యం తీసుకెళ్లిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అన్నారు. అధికారులు స్పందించి వెంటనే జీవో విడుదల చేసి కార్మికుల సమ్మె నివారణకు చర్యలు తీసుకోవాలని లేనియెడల ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి నర్సింగరావు, ఉపాధ్యక్షులు చక్రపాణి, కార్యదర్శి పిన్నెల హనుమాన్లు, యూనియన్ నాయకులు ఎన్.దేవేందర్, బాబర్, మోహన్, నాగనాథ్, కైసర్, సాయి, హైమద్, కృష్ణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన బాపూజీ వచనాలయ ప్రతినిధులు


కలెక్టర్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బాపూజీ వచనాలయ ప్రతినిధులు నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు పుష్పగుచ్ఛమిచ్చి శనివారం మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాపూజీ వచనాలయ కమిటీ అధ్యక్షులు గడ్డం భక్తవత్సలం మాట్లాడుతూ బాపూజీ వచనాలయాన్ని సందర్శించాల్సిందిగా జిల్లా కలెక్టర్‌ను కోరారు. తెలంగాణలోని అతిపెద్ద డిజిటల్ లైబ్రరీగా బాపూజీ వచనాలయాన్ని తీర్చిదిద్దుతున్నామన్నారు. కులాలకు, మతాలకు అతీతంగా బాపూజీ వచనాలయం వేదికగా నిలబడుతుందన్నారు. ఈ సందర్భంగా ఉర్దూ అకాడమి చైర్మెన్ తాహేర్‌బిన్ హందాన్ మాట్లాడుతూ.. ఉన్నత చదువులకోసం ఎన్నో సంవత్సరాలుగా ఈ లైబ్రరీ తోడ్పాటు అందించిందన్నారు. విద్యార్థుల కోసం వారి భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల బుక్స్‌ను అందుబాటులో ఉంచాలని వారు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే బాపూజీ వచనలయాన్ని సందర్శిస్తానని తెలిపారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మీసాల సుధాకర్‌రావు, ఉపాధ్యక్షులు బిడి.దాస్, సంయుక్త కార్యదర్శి ఏఎస్ సాంబయ్య, సభ్యులు ప్రతాప్ రుద్ర, కోవూరు జగన్, ఆమందు విజయ్, అరేట్టి లక్ష్మి నారాయణ, పాటి అనిల్‌రెడ్డి, గోవింద్ ప్రసాద్ జవర్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు సాలూరకు ఎమ్మెల్యే రాక

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రైతుసేవా కేంద్రం ప్రారంభోత్సవానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హాజరవుతున్నట్లు సొసైటీ సీఈఓ బస్వంత్ రావు, సొసైటీ చైర్మెన్ అల్లె జనార్దన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం ఆవరణలో గోదాము వద్ద ఆఫీస్ రూముల నిర్మాణం కొరకు శంకుస్థాపన చేయనున్నట్లు వారు తెలిపారు. కావున రైతులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

**నేడు ఎమ్మెల్యేలచే రైతు భవన్ ప్రారంభోత్సవం..**

సాలూర మండలం సాలంపాడ్ గ్రామంలో పాత సొసైటీ భవనం స్థానంలో నూతనంగా నిర్మించిన రైతుభవన్ (సొసైటీ కార్యాలయం)ను ఆదివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రారంభించనున్నట్లు సొసైటీ చైర్మెన్ బ్రహ్మరెడ్డి తెలిపారు.

## భావిభారత నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- ఆర్డిఓ రాజాగౌడ్



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

బావి భారత నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలో ఆర్డీవో కార్యాలయంలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ శాఖ ఆధ్వర్యంలో ఆర్డీవో మండల విద్యాశాఖ అధికారి రాజగంగారం చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ.. భావిభారత పౌరుల నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని, అలాగే విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలను అందించాలని, పాఠశాలల్లో స్నేహపూర్వక వాతావరణంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని మంచి పౌరులుగా ఎదిగేలా ప్రోత్సహించాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి రాజా గంగారం మాట్లాడుతూ.. పాఠశాలలు గుణాత్మక విద్యకు నిలయాలని విద్యార్థుల ఎదుగుదలకు, సమ సమాజ నిర్మాతలుగా తయారు చేయడానికి ఉపాధ్యాయులు వృత్తి నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం.బాలయ్య, ఉపాధ్యక్షులు రాసరి పెంటన్న పి.దాసు, రాష్ట్ర కౌన్సిలర్ విజయకుమార్, డిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఏక్‌నాథ్, మదర్ తదితరులు పాల్గొన్నారు.

## అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన చీకటి సూర్యుడు లూయి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన చీకటి సూర్యుడు లూయి అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. శనివారం స్నేహ సొసైటీలో నిర్వహించిన లూయి బ్రెయిలీ 216వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై.. లూయి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెప్పులు కుట్టే కుటుంబంలో జన్మించి, రెక్కాడితే కానీ కడుపు నిండని పరిస్థితుల్లో చిన్న వయసులో ప్రమాదవశాత్తు కంటి చూపు కోల్పోయిన చదువుకోవాలనే తపనే ఈ రోజు ప్రపంచం గర్వించదగ్గ మహోన్నత శక్తిగా ఎదిగిన వ్యక్తి లూయి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ స్కూల్ సెక్రటరీ సిద్దయ, డిడబ్ల్యుఓ రసూల్.బి, ప్రభుత్వం ఆసుపత్రి సూపరిండెంట్ ప్రతిమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రానికి చెందిన పల్లికొండ నర్సయ్య ఇల్లు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ ఘటనతో తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ స్పందించి పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, మైనారిటీ మండల అధ్యకులు జావిద్, నాయకులు కుందారపు శ్రీనివాస్, యూనుస్, గొప్ప ఉషాన్న, విక్కీ, వడ్ల రాజేశ్వర్, వినేష్, ఇమ్రాన్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలువురు కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే

**నవతెలంగాణ-ఆర్మూర్**

మండలంలోని గోవింద్‌పేట్, పిప్రి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పలువురి బాధిత కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. గోవింద్‌పేట్ గ్రామ మాజీ సర్పంచ్ బండమీది గంగాధర్ తల్లి ఇటీవల మరణించగా.. ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, మామిడిపల్లి చిన్నారెడ్డి, బీజెపి గ్రామ అధ్యక్షుడు బేల్దారి రమేష్, బండమీది సుభాష్, కిషన్ ,రాజు, మహేష్, చంద్రం, సురేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

## ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

**నవతెలంగాణ-ఎడపల్లి**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. మహిళల విద్య ప్రాముఖ్యతను వివరించారు. సావిత్రిబాయి పూలే సమాజానికి, మహిళ విద్య కోసం చేసిన సేవలను కొనియాడారు. పదవ తరగతి విద్యార్థులు సావిత్రిబాయి పూలే వేషధారణతో అలరించారు. మహిళా ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభారాణి, ఉష, చంద్రకళ, నరహరి, విజయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



# అంధులకు అక్షర ప్రదాత.. లూయిస్ బ్రెయిలీ

- ఎన్పీఆర్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేశాల గంగాధర్
- లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి వేడుకలు

**నవతెలంగాణ-బోధన్ టౌన్**

అందుల అక్షరం ప్రధాత.. లూయిస్ బ్రెయిలీ అని ఎన్పీఆర్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేశాల గంగాధర్ అన్నారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డీ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని లయన్స్ కంటి ఆస్పత్రి ఆవరణలో జిల్లా అధ్యక్షుడు గైని రాములు అధ్యక్షతన లూయిస్ బ్రెయిలీ 216వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి యేశాల గంగాధర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్నటువంటి అనేకమంది చీకటి జీవితాల్లో వెలుగుని నింపారని తెలిపారు. వారిని ఆదర్శ వంతంగా తీసుకొని నేడు ఉన్నటువంటి అంధులు, వికలాంగులు విద్యను నేర్చుకొని అనేక ప్రభుత్వ ఉద్యోగాలు ప్రైవేటు ఉద్యోగాలు సాధించి సమాజానికి సేవ చేస్తూ సకలాంగులకు మేమేమి తక్కువ కాదని నిరూపించుకున్నారని తెలిపారు. వారి జీవితాన్ని ఆదర్శవంతంగా తీసుకొని ప్రపంచంలోని మేధావులుగా అంధులు, వికలాంగులు తయారు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నజీర్, జిల్లా సహాయ కార్యదర్శి ముంజ సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు గంపల శంకర్, పల్లికొండ చింటూ, నేహాల్ గంగారాం, పోచయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

## రేవంత్‌రెడ్డి ఫోటో వద్ద భజనలతో నిరసన

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న నిరవధిక సమ్మె కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో గల ధర్నా చౌక్ వద్ద 29వ రోజు సమగ్ర శిక్ష ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోటో ఏర్పాటు చేసి భజనలు చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ.. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి సమగ్ర శిక్ష ఉద్యోగుల రెగ్యులరైజేషన్ సాధ్యం కాదని తెలియజేయడం హాస్యాస్పదమని అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఏఐఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి కిరణ్ కుమార్, జిల్లా కార్యదర్శి జ్వాలా, ఎస్టీటీ యూనియన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మధుసూదన్ రావు, పిఆర్టియు రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్ గౌడ్, ఎస్‌జిటియు జిల్లా అధ్యక్షులు ఎన్వి రమణ, గంగా ప్రసాద్, మోహన్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, మహిళా అధ్యక్షురాలు గంగామణి, జాన్, సత్యపాల్, పుష్పరాజు, అంజయ్య లక్ష్మణ్, రాణి, హిమబిందు, గిరీష్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధతో ఉత్తీర్ణ శాతం పెంచాలి

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9 గంటల నుండి ప్రత్యేక తరగతుల (స్టడీ అవర్) నిర్వహణ, అధ్యాపకుల హాజరు, ప్రార్థన నిర్వహణ తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థి పైన అధ్యాపకులు వ్యక్తి గత శ్రద్ధతో వారిని 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు శాయశక్తుల కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యా అధికారి ఆదేశించారు. కళాశాలకు హాజరు కాని విద్యార్థులను రప్పించేందుకు ప్రయత్నం చేయాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి అధ్యాపకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది అందరూ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐఈవో

## అనారోగ్యంతో యువకుడు ఆత్మహత్య

**నవతెలంగాణ-లింగంపేట్**

లింగంపేట్ మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన యువకుడు అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాలకు ఇలా ఉన్నాయి గ్రామానికి చెందిన పొట్టి వారి రామస్వామి 28 పెద్ద కొంతకాలంగా నడుము నొప్పి భరించలేక ఆసుపత్రిలో పలు చికిత్సలు చేయించుకుంటున్నాడు. తగ్గక పోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

## ఎడపల్లిలో కత్తిపోట్ల కలకలం

- భయాందోళనలో గ్రామస్తులు

**నవతెలంగాణ-ఎడపల్లి**

మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి గైని ప్రాంతంలో ఇద్దరి యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇద్దరు యువకులు మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దూషించుకున్నారు. ఈ వివాదం కాస్త రగిలి ఆందోళనకరంగా మారింది. అనంతరం ఓ యువకుడు కత్తితో దాడి చేయడంతో కత్తిపోట్ల కలకలం తలెత్తింది. ఈ ఘటనపై ఎడపల్లి పోలీసులకు ఇరువురు యువకుల నుంచి ఫిర్యాదు అందుకొని విచారణ ప్రారంభించినట్టు సమాచారం. ఈ ఘటన ఎడపల్లిలో తీవ్ర కలకలం సృష్టించడంతో సమీప గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రెండేండ్లక్రితం పోగొట్టుకున్న ఫోన్ రికవరీ

**నవతెలంగాణ-జుక్కల్**

రెండు ఏళ్ల క్రితం పోగొట్టుకున్న మొబైల్‌ను పోలీస్ శాఖ ప్రత్యేక యాప్ ద్వారా పోయిన ఫోన్ రికవరి చేసి పోగొట్టుకున్న వ్యక్తికి అందించినట్టు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. సిఈఐఆర్ అనే యాప్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను రికవరీ చేసినట్టు పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు తన మొబైల్ ఫోన్ లను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.

## వృద్ధురాలి మెడలోంచి గొలుసు చోరీ

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

నిజామాబాద్ నగరంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో వాకిలి ఊడుస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. గౌతమ్‌నగర్‌లో అనసూయ అనే మహిళ నివాసం ఉంటుంది. ఎప్పటిలాగే శనివారం తెల్లవారు జామున తన ఇంటి ముందు వాకిలి ఊడుస్తోంది. ఆ సమయంలో ఒక దుండుగుడు అటువైపు నడుచుకుంటూ వచ్చి వృద్ధురాలి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## ట్రాన్స్ ఫార్మర్‌ను ధ్వంసం చేసిన గుర్తు తెలియని దుండగులు

**నవతెలంగాణ-బోధన్**

బోధన్ మండలం పెగడాపల్లి గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి అందులోని విలువైన పరికరాలను దొంగిలించారు. వ్యవసాయ పంట పొలాలకు విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేయడంతో పంటలకు సాగు నీరందించడానికి రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తిందని స్థానిక రైతులు వాపోయారు.

## బీసీల గురించి మాట్లాడే హక్కు కవితకు లేదు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ మాజీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ఆకుల మహేందర్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత బీసీల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి, సర్కారు పెద్దపీట వేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25 బడ్జెట్లో బీసీల సంక్షేమానికి రూ.9200 కోట్లు కేటాయించిందని, గత 10 సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. ఎమ్మెల్సీ కవిత వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు.

## డిమాండ్స్ డేను విజయవంతం చేయండి

**నవతెలంగాణ-ఆర్మూర్**

డిమాండ్స్ డేను విజయవంతం చేయాలని, షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, పండించిన పంటకు గిట్టుబాటు ధరకోసం పోరాడుదామని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మద్దతు ధరపై రైతుల హక్కుల సాధనకై అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో శనివారం డిమాండ్స్ డే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం ఏరియా అధ్యక్షులు ఆకుల గంగన్న, ఏరియా ప్రధాన కార్యదర్శి మచ్చర్ల రాజన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బి.దేవారం, సబ్ డివిజన్ కార్యదర్శి కిషన్, నాయకులు తలారి గంగాధర్, తర్పటి శ్రీనివాస్, రవి, బాలు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## మారుతి మందిరంలో పుష్యమాస

**నవతెలంగాణ-బోధన్ టౌన్**

బోధన్ పట్టణంలోని నర్సి రోడ్డు మారుతి మందిరంలో పుష్య మాస మొదటి శనివారం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ప్రవీణ్ మహారాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాదె అశోక్ అన్న వితరణ కార్యక్రమం చేపట్టారు. ఇప్పటి నుంచి ప్రతి శనివారం అన్న వితరణ కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుండేటి శంకర్, ధర్మకర్తలు బోదు శేఖర్, జి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీ తండాలో ఇందిరమ్మ రాండమ్ తనిఖీ

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

మండలంలోని కొత్తచెరువు తండా గ్రామ పంచాయతీలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేను శనివారం ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్ రాండమ్ తనిఖీ చేశారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం సిబ్బంది చేసిన సర్వేలో భాగంగా తన యాప్‌కు వచ్చిన ఐదు శాతం ఇందిరమ్మ ఇండ్లను ఆయన రీ వెరిఫికేషన్ చేశారు. సిబ్బంది చేసిన సర్వే సక్రమంగా చేశారా లేదా? సర్వేలో ఏమైనా పొరపాట్లు చేశారా అనే విషయాలను ఎంపీడీవో రీ వెరిఫికేషన్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గుర్తింపు కోసం సిబ్బంది చేసిన సర్వేలో భాగంగా ఆయా గ్రామాల్లో ఐదు శాతం రాండమ్ తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. సర్వేలో సిబ్బంది ఏమైనా పొరపాట్లు చేసినట్లు గుర్తిస్తే వాటిని మళ్లీ సర్వే చేసేందుకు తిప్పి పంపనట్లు తెలిపారు. సిబ్బంది సర్వేలో లబ్ధిదారుల వివరాలను సక్రమంగా పొందుపరిచారని తన రాండమ్ సర్వేలో తేలితే వాటిని ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆయన స్పష్టం చేశారు.

## ఏఎంసీ చైర్‌పర్సన్‌కు సన్మానం

**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**

ఎల్లారెడ్డి ఏఎంసి చైర్పర్సన్ గా నియమితులైన రజిత వెంకటరామిరెడ్డి తొలిసారిగా పోచారం గ్రామానికి రావడంతో పోచారం మాజీ సర్పంచ్ విజిత శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సన్మానించారు. అదేవిధంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## రెన్యూ సోలార్ ఎనర్జీని పరిశీలించిన ప్రత్యేక అధికారి

**నవతెలంగాణ-సదాశివనగర్**

జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాణాధికారి మండల ప్రత్యేక అధికారి చందర్ నాయక్ శనివారం ధర్మారావుపేట గ్రామంలో రెన్యూ సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు అంగన్వాడి కేంద్రం పరిశీలించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఐకెపి మహిళా శక్తి పాడి పశువులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో అధికారి సంతోష్ కుమార్, మండల విద్యాధికారి యోసెఫ్ మండల ఏపీఓ శ్రీనివాస్ ఏపీఎం రాజిరెడ్డి ఈసీ మధు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన రెడ్‌క్రాస్ బృందం

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

రెడ్‌క్రాస్ శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు అధ్యక్షతన జిల్లా పాలనాధికారి, రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అలాగే జిల్లా జడ్జి సునీత కుంచాల, అదనపు పాలనాధికారి అంకిత్‌ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు శనివారం తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపె రవిందర్, పి.ఆర్.ఓ బొడ్డుల రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

## కంజర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా వేముల మురళి

**నవతెలంగాణ-మోపాల్**



మండలంలోని కంజర మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా వేముల మురళి బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ ఆర్‌సిఓ సత్యనారాయణరెడ్డి ఇన్చార్జిగా వ్యవహరించారు.

## ఎస్‌జిటియు క్యాలెండర్ ఆవిష్కరణ

**నవతెలంగాణ-ఆర్మూర్**

మండలం ఎస్‌జిటియు 2025 క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పొన్న ప్రవీణ్, ప్రధాన కార్యదర్శులు ఆనంద్, మండల కార్యవర్గ సభ్యులు అరవింద్ కుమార్, బసంత్, గంగారం జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రదీప్ రాజ్, వినోద్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎంపీపీ

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావును సిరిల్లాలో ఇందల్‌వాయి మాజీ ఎంపీపీ బాధవత్ రమేష్ నాయక్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు శనివారం తెలిపారు. ఆయన వెంట ధర్పల్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షులు హన్మంత్‌రెడ్డి, తదితరులున్నారు.

## విద్యార్థులకు అల్పాహారం అందించాలి

**నవతెలంగాణ-పోతంగల్**

మండలంలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో నవంబర్ మొదటి వారం నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించిన నేపథ్యంలో విద్యార్థులకు అల్పాహారం అందించాలని కోరుతూ విద్యార్థులతో కలిసి, స్థానికులు ఎంఈవో శంకర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఉదయం హడావుడిగా, అల్పాహారం చేయకుండానే విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు భజరంగ్, అశోక్, సాయిలు, పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తా

- ఐలవ్ మై విలేజ్ ఫౌండర్ నాగేంద్ర

**నవతెలంగాణ-బోధన్**

సాలూర మండలం తగ్గెల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి భవిష్యత్తులో తప్పనిసరిగా తనవంతు సహాయ సహకారం అందిస్తానని ఐలవ్ మై విలేజ్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ ఎన్‌ఆర్ఐ నాగేంద్ర అన్నారు. శనివారం తగ్గెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు పునాది విద్యార్థులేనని, వారు సంపూర్ణ ఆరోగ్యవంతులైతేనే అన్ని సాధించవచ్చని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన మినరల్ వాటర్ అందించాలనే సంకల్పంతో ఈ ప్లాంటు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎన్‌ఆర్ఐ నాగేంద్రను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రభావతి, పీఆర్టీయూ నాయకులు రవికిరణ్, హెచ్ఎం దాసరి ధన్‌రాజ్, వీడీసీ సభ్యులు రాజు, దేవరావు, అంబదాస్, ఉపాధ్యాయులు అశోక్, శ్రీహరిరెడ్డి, కస్తూరి, హన్మండ్లు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నాగేంద్రను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

# ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం

- ఎమ్మార్పీఎస్ మండల కో ఇన్చార్జ్ శ్యామ్ మాదిగ

**నవతెలంగాణ-ఆర్మూర్**

ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తుందని ఎమ్మార్పీఎస్ మండల కో ఇన్చార్జ్ శ్యామ్ మాదిగ అన్నారు. శనివారం పట్టణంలోని అరుంధతి నగర్‌లో ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ అమలు విషయంలో జాప్యం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఖరికి నిరసనగా ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే సంస్మృతిక "వెయ్యి గొంతులు-లక్ష డప్పులు" కార్యక్రమాన్ని, జనవరి 7 నుంచి జిల్లాలో జరిగే డప్పు కళాకారుల సన్నాహక సమావేశాలను కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపైన ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి మాదిగలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. అరుంధతినగర్ మాదిగ సంఘంలో ఎమ్మార్పీఎస్ కమిటీని ఎన్నుకున్నారు.

అరుంధతి నగర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులుగా జంగం గోపి మాదిగ, ఉపాధ్యక్షులుగా బాల గణేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా మైదం రాములు మాదిగ, కార్యవర్గ సభ్యులుగా కే మనోహర్ మాదిగ, టి అభినవ్ మాదిగ, నితీష్ మాదిగ, శ్రీధర్ మాదిగ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. కార్యక్ర మంలో ఎమ్మార్పీఎస్ ఆర్మూర్ మండల నాయకులు మైలరం రాము మాదిగ, మురళీ కృష్ణ మాదిగ, అరుంధతి మాదిగ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కమిటీ

# రాష్ట్రస్థాయి మార్చ్‌ఫాస్ట్‌లో జిల్లాకు రెండవ బహుమతి

**నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్**

రాష్ట్రస్థాయి మార్చ్ ఫాస్ట్‌లో జిల్లాకు రెండవ బహుమతి వచ్చింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ తరపున రాష్ట్రస్థాయిలో అన్ని జిల్లాల నుంచి అన్ని వయసుల వారీగా పోటీలు శనివారం నిర్వహించారు. దాంట్లో భాగంగా లాంగ్ జంప్‌లో నిజామాబాద్ జిల్లాకు చెందిన సురేష్‌కు గోల్డ్ మెడల్ వచ్చింది. అలాగే 10 కిలోమీటర్ల పరుగు పందెంలో నర్సయ్య (40)వ గ్రూపులో మూడో బహుమతి, 35వ వయసు గ్రూపులో డాక్టర్ ఆదిత్యకు రెండవ బహుమతి, 55వ వయసు గ్రూపులో శద్రక్‌కి లాంగ్ జంప్‌లో మొదటి బహుమతి, శారదకు (40)వ వయస్సులో లాంగ్ జంప్‌లో మొదటి బహుమతి, (50)వ వయసు గ్రూపులో శ్రీలతకు షాట్ పుట్‌లో మొదటి బహుమతి, విజయలక్ష్మి లాంగ్ జంప్లో 800 మీటర్స్ 100 మీటర్స్‌లో మొదటి బహుమతి సాధించారు. అలాగే 19 జిల్లాల నుంచి మార్చ్ ఫాస్ట్ పోటీల్లో పాల్గొనగా.. నిజామాబాద్ జిల్లాకు రెండో బహుమతి రాగా నిజామాబాద్ మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ సంఘం సభ్యులు నీత రెడ్డి, గోపి తదితర సభ్యులు మంత్రి దామోదర రాజనరసింహ చేతుల మీదుగా రెండవ బహుమతి అందుకున్నారు.



బహుమతిని అందుకుంటున్న పలువురు

# మహిళలకు ఉచిత ప్రెషర్ కుక్కర్‌లు పంపిణీ

- రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో..

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో వివిధ సంస్థలలో పనిచేసే మహిళలకై ఉచిత ప్రెషర్ కుక్కర్లను పంపిణీ చేసినట్టు అధ్యక్షులు బిరెల్లి విజయరావు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమం కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ కింద మహారాష్ట్ర పూణేకి చెందిన గేర్ వేర్ టెక్నికల్ ఫైబర్స్ లిమిటెడ్ వారి సహకారం అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సీనియర్ న్యాయవాది, రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఫౌండర్ సభ్యులు మధన్ లాల్ గుప్తా హాజరై మాట్లాడుతూ.. గత 70 సంవత్సరాలకుపైగా నిజామాబాద్ రోటరీ క్లబ్ దిన దినాన సమాజంలో ప్రత్యక్షంగా పరోక్షంగా క్లబ్ ద్వారా ఎన్నో సహాయ సహకారాలు అందిస్తున్నందుకు సభ్యులకు అభినందనలు తెలిపారు. తదనంతరం ఇలాంటి సి.ఎస్.ఆర్ ప్రోగ్రాంల ద్వారా మహిళలకు లబ్ధిచెందడం అభినందించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా నిజామాబాద్ గేర్‌వేర్ సంస్థకు చెందిన డిస్ట్రిబ్యూటర్ రాజగోపాల్ గిల్డ, రోటరీ క్లబ్ సీనియర్ సభ్యులు రమేష్ గిల్డలు, క్లబ్ సభ్యులు కార్యదర్శి గంగారెడ్డి, కోశాధికారి భరత్ పటేల్, బాబురావు, జ్ఞాన ప్రకాష్, కమల్ గిల్డ తదితరులు పాల్గొన్నారు.

## మదన్ మోహన్ యూత్ ఫోర్స్ నియోజకవర్గ అధ్యక్షుడిగా సంతోష్

**నవతెలంగాణ-గాంధారి**

మండలంలోని కాటేవాడి తండాకు చెందిన బానోత్ సంతోష్ నాయక్‌ను మదన్ మోహన్ యూత్ ఫోర్స్ (ఎంఐఎఫ్) నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించారు. శనివారం ఎమ్మెల్యే మదన్మోహన్ సంతోష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి నన్ను నియోజకవర్గ ఎంఐఎఫ్ అధ్యక్షుడిగా నియమించినందుకు ఎమ్మెల్యే మదన్మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజవర్గంలోని సమస్యలను తెలుసుకుని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారాన్ని కృషి చేస్తానని సంతోష్ తెలిపారు.



## జాతీయ అవార్డు గ్రహీతను సన్మానించిన ఎమ్మెల్యే

**నవతెలంగాణ-ఆర్మూర్**

పట్టణంలో ప్రముఖ సామాజిక సేవకులు జాతీయ స్థాయి అవార్డు గ్రహీత పట్వారి తులసి కుమార్‌ను ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి శనివారం ఘనంగా సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్ సేవా రత్న పురస్కారం పొందడం జిల్లా ఆర్మూర్ పట్టణానికే గర్వకారణమని, వీరి సేవలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం వారిని ఖమ్మం జిల్లాలో సన్మానించడం అనేది అందరికీ, నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. నాయకులు ఉదయ్, జెస్సు అనిల్ మాట్లాడుతూ.. 15 సంవత్సరాల నుంచి వ్యక్తిగత ఖర్చుతో విద్యార్థులకు వృద్ధులకు ప్రజలకు తమ వంతు వివిధ అంశాలలో సేవలో ముందుంటూ జాతీయస్థాయిలో భారత సేవారత్న పురస్కారం పట్వారి తులసికి లభించడం, పట్టణానికి జిల్లాకే గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో పట్వారీ గోపికృష్ణ, పోల్కం వేణు, యామాద్రి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.